సాక్షి కర్నూలు

గురువారం, 27, జూలై, 2023



నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌కు చెందిన లహరి ఘంటసాల బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం సుంకేసుల డ్యాం నుంచి 130 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శుభ్రతతో డెంగీ నివారణ

సి.బెళగల్: పరిసరాల శుభ్రతతో డెంగీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. బుధవారం సి.బెళగల్ మండలంలో ఆయన పర్యటించారు.

న్యూస్‌రీల్

ఇండస్ట్రియల్ హబ్‌కు 9వేల ఎకరాలు



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ కోసం ఇప్పటికే 9 వేల ఎకరాలను గుర్తించి, కేటాయించామని, కొన్ని చోట్ల భూసేకరణ పెండింగ్‌లో ఉందని, త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూసేకరణ పనులపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముచ్చుమర్రి నుంచి ఇండస్ట్రియల్ హబ్ వరకు వేయనున్న పైపులైన్ కోసం భూసేకరణ చేయాలన్నారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూములను కూడా మ్యూటేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీఐఐసీ జేడీఎం టి.కృష్ణమోహన్‌రావు, సర్వే ఏడీ రామ్మోహన్, కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్. శివరాముడు, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం అజరామరం



కార్గిల్ వీరులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): అమరవీరుల త్యాగం అజరామరమైనదని మాజీ సైనికుల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నర్రా పేరయ్య అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో 531 మంది సైనికులు వీరమరణం పొందగా, 1,300 మంది సైనికులు గాయపడ్డారన్నారు. వీర మరణం పొందిన సైనికులను ప్రతి సంవత్సరం గుర్తుకు తెచ్చుకోవడం కోసం విజయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు శేషిరెడ్డి, సుధాకర్, నజీర్ అహ్మద్, గడ్డం రామకృష్ణ, కేసీ రాముడు, కేడీవీఎం రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరింత పకడ్బందీగా ఈహెచ్‌ఎస్ సేవలు



ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మరింత పకడ్బందీగా ఈహెచ్‌ఎస్ సేవలు అందించనున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు చెప్పారు. బుధవారం కర్నూలులోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దీర్ఘకాలిక వ్యాధుల ఓపీ సేవలు కొనసాగుతాయని, రోజుకొక స్పెషాలిటీ చొప్పున ఓపీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది వచ్చినా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాత్రివేళ అత్యవసరమైతే ఈహెచ్‌సీ కార్డు చూపించి ఆసుపత్రిలో చేరవచ్చన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా సూపర్‌స్పెషాలిటీ సేవలను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలోనూ ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ. మరియానందం, నంద్యాల జిల్లా అధ్యక్షులు బి. మాధవస్వామి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రూ.15కే జనతా ఖానా

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో జనతా ఖానా పేరుతో తక్కువ ధరకే ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ డివిజన్‌లో కాచిగూడ రైల్వే స్టేషన్, మహబూబ్ నగర్, కామారెడ్డి, నిజామాబాద్‌తో పాటు కర్నూలు సిటీ స్టేషన్లను ఎంపిక చేసిన దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు బుధవారం హైదరాబాద్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనరల్ కోచ్‌లలో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా ప్లాట్‌ఫాంలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేవలం 15 రూపాయలకే 340 గ్రాముల ఆహారం అందించనున్నారు. ఇందులో 175 గ్రాముల 7 పూరీలతో పాటు 150 గ్రాముల కర్రీ, 15 గ్రాముల చట్నీ, మిర్చి ఉంటుందని అధికారులు తెలిపారు.



పాణ్యం మండలం మద్దూరు సమీపంలోని పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె సమీపంలో కళకళలాడుతున్న మొక్కజొన్న



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

వర్షించిన ఆశలు!

ఖరీఫ్‌కు ప్రాణం

- గత పది రోజులుగా ఉమ్మడి జిల్లాలో వర్షం
- సాగులోని పంటలకు జీవం
- రానున్న రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- గత 24 గంటల్లో సగటున 41.7 మి.మీ వర్షపాతం
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- నేడు పాఠశాలలకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ కొత్త శోభను సంతరించుకుంటోంది. అన్ని మండలాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఆశలకు ప్రాణం వచ్చింది. సాగులోని పంటలన్నీ పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూములు పూర్తి స్థాయిలో పదునయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో సగటున 41.7 మి.మీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 45.8 మి.మీ, అత్యల్పంగా చిప్పగిరిలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో అత్యధికంగా నందికొట్కూరులో 38.2, అత్యల్పంగా చాగలమర్రిలో 5.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షాలు కురుస్తునే ఉన్నాయి. కొద్ది రోజులుగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడుతుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతోంది. ఈ నెల 26 నాటికి కర్నూలు జిల్లాలో 15 శాతం అధిక వర్షపాతం నమోదైంది. నంద్యాల జి ల్లాలో 13 శాతం లోటు వర్షపాతం ఉన్నా.. ఈ జిల్లాలో కూడా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల అధిక వర్షపాతం నమోదు కానుంది. కాస్త ఆలస్యంగానైన ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటం రైతులకు ఊరటనిస్తోంది.

మరింత విస్తారంగా వర్షాలు

రానున్న రోజుల్లో వర్షాలు మరింత విస్తారంగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పటికే భూములు పూర్తిగా పదును కావడంతో ఇప్పటి నుంచి ప్రతి చినుకు వరదగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులకు చేరుకోగా.. మరింత పెరిగే అవకాశం ఉంది. హంద్రీ నదిలోనూ నీటి ప్రవాహం కనిపిస్తోంది.



ఆస్పరి మండలం అట్టెకల్లు సమీపంలో టమాట మొక్కలు నాటుతున్న దృశ్యం

మరో మూడు రోజులు భారీ వర్షాలు

- టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో శిథిలమైన భవనాల్లో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు, వాగులు, వంకలను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలన్నారు. స్థానికంగా గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

గత 24 గంటల్లో అత్యధిక వర్షపాతం ఇలా..

మండలం	కురిసిన వర్షం(మి.మీ)
కర్నూలు అర్బన్	45.8
కర్నూలు రూరల్	42.8
నందికొట్కూరు	38.2
జూపాడుబంగ్లా	36.6
బండిఆత్మకూరు	35.6
కల్లూరు	35.6
వెలుగోడు	35.6
మహానంది	35.4
మిడుతూరు	34.2
గోస్పాడు	34.2
నంద్యాల	32.8
గడివేముల	32.2
వెల్దుర్తి	31.0
పగిడ్యాల	30.8
సీ.బెళగల్	30.2
గూడూరు	30.2



కోడుమూరు వద్ద వర్షాలకు ప్రాణం పోసుకున్న పత్తి పైరు

నేడు పాఠశాలలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో కర్నూలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం సెలవు ప్రకటించారు.

అన్ని పంటల సాగుకు అవకాశం

ఈ నెల చివరి వరకు, ఆగస్టు నెలలో ఏఏ పంటల సాగుకు అవకాశం ఉందనే విషయమై జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వివరించారు.

- జిల్లాలోని తేలిక నేలల్లో ఈ నెల చివరి వరకు పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, అలసంద పంటలు వేసుకోవచ్చన్నారు.
- నల్లరేగడి నేలలు పత్తి, కంది, ఆముదం, కొర్ర, మొక్కజొన్న సాగుకు అనుకూలం అన్నారు.
- నల్లరేగడి నేలల్లో పత్తి పంటను ఆగస్టు మొదటి వారం వరకు వేసుకోవచ్చని సూచించారు.
- ఎర్ర నేలల్లో ఆగస్టు నెలలో కంది, సజ్జ, పెసర, అలసంద, పంటలు, నల్ల రేగడి నేలల్లో కొర్ర, పొద్దుతిరుగుడు, కంది పంటల సాగుకు అనుకూలం అన్నారు.
- రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నేల రకాన్ని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలను అనుసరించి సాగు చేసుకోవాలన్నారు.

పెరుగుతున్న సాగు

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4,21,548 హెక్టార్లు ఉండగా..గత వారం సాగు విస్తీర్ణం 70 వేల హెక్టార్లు ఉంది. ఈ నెల 24వ తేదీ నాటికి సాగు విస్తీర్ణం 1,33,553 హెక్టార్లకు చేరుకుంది. ఇప్పటి వరకు పంటల సాగు 31.68 శాతం పూర్తయింది. వచ్చే వారం నాటికి సాగు 50 శాతం దాటే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా పత్తి 83,489 హెక్టార్లలో సాగయింది. వేరుశనగ 24,700, ఆముదం 3,879, సజ్జ 2,428, మొక్కజొన్న 1,001, కంది 8,650, మిర్చి 3,401, ఉల్లి 3,109, టమాట 449 హెక్టార్ల ప్రకారం పంటలు సాగయ్యాయి.

- నంద్యాల జిల్లాలో నీటిపారుదల కింద ఎక్కువగా సాగు ఉంది. డోన్ అసెంబ్లీ నియోజక వర్గంలో మాత్రమే వర్షాధారం సాగు ఎక్కువగా ఉంటోంది. ఈ నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో సాగు ఊపందుకుంది.

ఉమ్మడి జిల్లాలో అదుపులో శాంతిభద్రతలు

- సూపర్ న్యూమరీ డీఎస్పీలను రెగ్యులర్ చేస్తూ పదోన్నతి
- త్వరలో ఎస్‌ఐలకు పదోన్నతులు
- ఏపీ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా గత సంవత్సరం కన్విక్షన్ బేస్డ్ పోలిసింగ్ ఏర్పాటు చేశామని, దీనివల్ల మంచి ఫలితాలు వచ్చాయని ఏపీ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై ఉమ్మడి జిల్లా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే గడిచిన ఆరు నెలల కాలంలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. బాడీలీ అఫెన్స్, మర్డర్, డౌరీ డెత్, హత్యా ప్రయత్నాలు తదితర గ్రేవ్ క్రైం కర్నూలు జిల్లాలో 27 శాతం, నంద్యాల జిల్లాలో 25 శాతం తగ్గాయని వివరించారు. దిశ యాప్ అందుబాటులోకి రావడంతో మహిళలపై నేరాలు భారీగా తగ్గాయన్నారు. కర్నూలు జిల్లాలో 65 శాతం, నంద్యాల జిల్లాలో 46 శాతం మహిళా నేరాలు తగ్గాయన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు కర్నూలులో 39 శాతం, నంద్యాలలో 36 శాతం, ఎస్సీ, ఎస్టీ నేరాలు 27 శాతం తగ్గాయన్నారు. నేరాలు తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రౌడీ మూకలపై గట్టి నిఘా ఉంచామన్నారు. గత సంవత్సరం అక్రమ మద్యం రవాణా చేసే గ్యాంగ్‌లపై పీడీ యాక్ట్ కింద 35 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా పీడీ యాక్ట్ సిద్ధం చేశామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 13వేల కేసులు అందజేస్తే 1400 కేసులు ట్రయల్ పూర్తయి 62 శాతం రికార్డు స్థాయిలో శిక్షలు పడ్డాయన్నారు.

త్వరలో ఎస్‌ఐలకు పదోన్నతులు

ఎస్‌ఐలకు పదోన్నతులు రావడం లేదని వినతిపత్రం అందజేశారని, వాటిని సానుకూలంగా పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్ న్యూమరీ డీఎస్పీలను రెగ్యులర్ డీఎస్పీలుగా పదోన్నతి కల్పించినట్లు వెల్లడించారు. మూడు సంవత్సరాల్లో ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం మిస్సింగ్ కేసులలో రాష్ట్ర వ్యాప్తంగా 26వేల మందిలో 23,300 మందిని గుర్తించి వారి ఇళ్లకు చేర్చామన్నారు. అదృశ్యమైన వారు ట్రేస్ అయ్యేకొద్దీ ఆ కేసుల సంఖ్య పూర్తిగా తగ్గుతూ వస్తాయని వెల్లడించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

కర్నూలు(సెంట్రల్): తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయపార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. ఇందుకోసం బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటా సర్వేకు రాజకీయ పార్టీల ఏజెంట్లను అనుమతించాలన్నారు. సమ్మరీ రివిజన్‌లో భాగంగా రాజకీయ పార్టీలు లేవనెత్తే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, వైఎస్ఆర్‌సీపీ నుంచి పుల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి సత్యనారాయణగుప్తా, బీజేపీ నుంచి కాళింగ నరసింహవర్మ, టీడీపీ నుంచి ఎల్వీ ప్రసాదు హాజరయ్యారు.

29న మొహర్రం


- శుక్ర, శనివారాలు ఉపవాసం ఉంటే అధిక పుణ్యం

కర్నూలు(రాజ్‌విహార్): మొహర్రంను ఈ నెల 29న భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ముహమ్మద్ ప్రవక్త మనువడు ఇమామే హుసేన్‌తో పాటు ఆయన అనుయాయులు దేశ ప్రజల దాహం తీర్చేందుకు ఇరాక్‌లోని కర్బలా యుద్ధ మైదానంలో శత్రువులతో వీరోచితంగా పోరాడి షహీద్ (స్వర్గస్తులు) అయ్యారు. షహీద్‌లుగా వీరమరణం పొందిన వారిని స్మరించుకుంటూ నిర్వహించుకునే షహాదత్ కార్యక్రమాన్ని మొహర్రం అంటారు. అరబిక్ క్యాలెండర్‌లో మొదటి నెల పేరు మొహర్రం. ఈ మాసంలో 10రోజున షహదత్ జరుపుకుంటారు. కొందరు దీనిని పండుగ అని, మరి కొందరు షహదత్ అని కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఈ నెల 28, 29వ తేదీల్లో శుక్ర, శనివారాల్లో ఉపవాసాలు ఉండటం ఎంతో పుణ్యప్రదం ఈద్ మిలాప్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మౌలానా షఫీ పాషాఖాద్రీ పేర్కొన్నారు. లేదంటే 29, 30 తేదీల్లో అయినా రోజాలు పాటించవచ్చని సూచించారు.

సహెరీ, ఇఫ్తార్ వేళలు

ఈ నెల 28న సహెరీ అంటే ఉదయం 4.20గంటలు, 29, 30వ తేదీల్లో 4:21గంటల్లోపు ఆహారం తీసుకోవాలి. ఇఫ్తార్ అంటే మూడు రోజులు సాయంత్రం 6.53 గంటలు ఉపవాస దీక్ష విరమించుకోవచ్చు. పూర్తి వివరాలకు ఖాజీ, మౌల్వీలను సంప్రదించాలి.

ఒక్క రోజులోనే 10 టీఎంసీల నీరు



ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

- శరవేగంగా నిండుతున్న టీబీ డ్యాం
- 1.12 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 51 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

హొళగుంద: భారీ వరదలతో తుంగభద్ర జలాశయానికి ఒక్కరోజులోనే 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. మంగళవారం రాత్రి ఇన్‌ఫ్లో 98 వేల క్యూసెక్కుల వరకు ఉండగా బుధవారం సాయంత్రం 6 గంటలకు 1,12,801 క్యూసెక్కులకు పెరిగింది. మంగళవారం డ్యాంలో 41 టీఎంసీల నీరు నిల్వ ఉండగా..బుధవారం రాత్రికి అది 51 టీఎంసీలకు చేరుకుంది. డ్యాం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మంగళూరు, వరనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. బుధవారం సాయంత్రానికి 1613.16 అడుగులకు చేరింది. నాలుగేళ్లుగా టీబీ డ్యాంకు రికార్డు స్థాయిలో నీరు వచ్చి చేరుతోంది. దీంతో తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రైతులు ఖరీఫ్, రబీలో పంటలు పండిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆయకట్టులో వరి సాగు చేసేందుకు ఇప్పటికే బోరు బావుల కింద నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు.

ఆదోని ప్రాంత అభివృద్ధికి చర్యలు

- బనవాసిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై అధ్యయనం
- దేవనకొండలో ఉల్లి స్టోరేజ్ గోడౌన్
- రాంజల చెరువు సుందరీకరణ
- జూమ్ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



జూమ్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ఆదోని ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఆడా)పై బుధవారం జిల్లాస్థాయి అధికారులతో జూమ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచనల మేరకు ఆడా స్వరూపాన్ని మార్చేందుకు శాఖల వారీగా ప్రతిపాదనలను పంపాలన్నారు. పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. సీ బెళగల్ ట్యాంకు సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. హెచ్ఎస్ఎస్ కెనాల్ నీటితో ఆస్పరి మండలంలోని 10 చెరువులను నింపేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. కర్ణాటక రాష్ట్రం, కర్నూలు జిల్లాలోని విద్యాసంస్థలు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈకి సూచించారు. బనవాసి ఫారంలో టెక్స్‌టైల్ పార్కు, పౌడర్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, అమూల్ మోడల్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. దేవనకొండలో ఉల్లి స్టోరేజ్ గోడౌన్ ఏర్పాటు కోసం ఎకరా భూమిని కేటాయించాలని కోరారు. జీవనోపాధుల కింద 11 వేల యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి లైవ్లీహుడ్‌కమిటీ ఏర్పాటు చేసి, పురోగతిపై తరచూ సమీక్షించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సూచించారు. జిల్లాలో సోలార్ డ్రైయర్ యూనిట్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అందుకోసం అవసరమైన ఉల్లి రకాలను 10 వేల ఎకరాల్లో రైతులు పండించేలా చర్యలు తీసుకోవాలని ఫుడ్‌ప్రాసెసింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. ఆదోనిలో రాంజల చెరువు సుందరీకరణకు, గోనెగండ్ల మండలం గాజులదిన్నెలో బోటింట్, రెస్టారెంట్ల ఏర్పాటుకు టూరిజం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆడా పరిధిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. ఇక నుంచి వారంలో ఒకసారి సబ్ కలెక్టర్ స్థాయి, 15 రోజులకు ఒకసారి కలెక్టర్ స్థాయిలో ఆడా సమావేశాలు జరిగేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. జూమ్‌లో సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హజ్‌యాత్రలో ఆదోనివాసి మృతి


రఫీక్ అహ్మద్ (ఫైల్)

ఆదోని అర్బన్: హజ్ యాత్రకు వెళ్లి అనారోగ్యంతో ఆదోని పట్టణం బార్‌పేటకు చెందిన ముండి రఫీక్ అహ్మద్(68) బుధవారం మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... గత నెల జూన్ 9న ఆదోని నుంచి రఫీక్ అహ్మద్ మక్కాకు వెళ్లారు. జూన్ 16వ తేదీ రాత్రి ఒక్కసారిగా మక్కాలో అకస్మాత్తుగా కిందకు పడిపోవడంతో తోటి యాత్రికులు అక్కడే ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకుని ఉమాన్‌లో ఉద్యోగం చేస్తున్న రఫీక్ కుమారుడు షేక్‌అహ్మద్ మక్కాకు చేరుకొని తండ్రి బాగోగులు చూసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత కోలుకున్న రఫీక్ అహ్మద్ డాక్టర్ల సాయంతో హజ్ యాత్రను పూర్తి చేశాడు. బుధవారం ఉదయం బీపీ తక్కువ కావడంతో మృతిచెందారు. రఫీక్ అహ్మద్ ఆదోని పట్టణంలో స్టోర్ డీలర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


మృతి చెందిన ధరణి

శ్రీశైలం: డిగ్రీ ఫస్టియర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. శ్రీశైలం ఏపీ ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న సత్యనారాయణ కుమార్తె ధరణి (20) బెంగళూరులో బీఎస్సీ ఆప్తమాలజీ చదువుతోంది. ఫస్టియర్‌లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసినా, అందులో కూడా ఫెయిల్ కావడంతో ఆమెకు ధైర్యం చెప్పి ఇంటి వద్దే ఉంచారు. అయితే తీవ్ర మనస్తాపానికి గురైన ధరణి బుధవారం వేకువజామున 2.30 గంటల సమయంలో బాత్రూమ్‌లో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు దేవస్థానం వైద్యశాలలో చేర్పించేటప్పటికే ప్రాణాలు కోల్పోయింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏపీట్రాన్స్‌కో ఉద్యోగులు, సిబ్బంది దేవస్థానం వైద్యశాలకు చేరుకుని ఏఈ సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ దుర్మరణం


మృతి చెందిన అంకాల్

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ రమేష్, క్లీనర్ అంకాల్ (36)నంద్యాలకు వచ్చి తిరిగి కడపకు వెళ్తున్నారు. ఆళ్లగడ్డ సమీపంలోని లింగందిన్నె అప్రోచ్‌రోడ్డు సమీపంలో హఠాత్తుగా కర్ణాటకకు చెందిన లారీ బైపాస్ రోడ్డుపైకి వచ్చింది. దీంతో నంద్యాల నుంచి వెళ్తున్న లారీ అదుపు తప్పి కర్ణాటక లారీని వెనుక వైపున ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్లీనర్ అంకాల్ అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు క్షతగాత్రుడు ఫిర్యాదుతో కర్ణాటక లారీ డైవర్ శివరాజ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవకాశాలు ఓపెన్

చాలా మందికి ఉన్నత విద్య అభ్యసించాలని ఆశ ఉంటుంది. అయితే అనుకోని అవాంతరాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెడుతుంటారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సుకు వచ్చేసిన తర్వాత చదువుకుని ఉంటే భవిష్యత్తు బాగుండేదని, ఏదైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవని దిగులు పడుతుంటారు. ఇలాంటి వారికి సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) వరంగా మారింది.

- సార్వత్రిక విద్యకు పెరుగుతున్న ఆదరణ
- సాధారణ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఇంటి దగ్గర నుంచే చదివే అవకాశం
- నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు అడ్మిషన్లు షురూ


సార్వత్రిక విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): నియత పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు, వయోజనులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రోజు వారి కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పదవ తరగతి, ఇంటర్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తుంది. ఈ విద్యకు ఆదరణ పెరుగుతోంది. ఏటా వేలాది మంది అడ్మిషన్లు పొంది స్టడీ సెంటర్లలో చదువుకుంటున్నారు. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకు అర్హులే అవుతారు.

ఇవీ సబ్జెక్టులు..

పదవ తరగతి గ్రూపు–ఏలో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీ తీసుకోవచ్చు. గ్రూప్–బీలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్ గ్రూపు–ఏలో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీ తీసుకోవచ్చు.

దరఖాస్తుకు అర్హతలు...

పదవ తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31 తేదీ నాటికి 14 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు సీటు, పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు పదోతరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల కులధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

గ్రూపు–బీలో ప్రధాన సబ్జెక్టులో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

పదోతరగతి/ఇంటర్ ఏదైనా అభ్యాసకులు నిర్దిష్ట ఐదేళ్లలో పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. 9 సార్లు పరీక్షలు రాసుకోవచ్చు. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ పాస్ అయి రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన సబ్జెక్టులు రాసుకోవచ్చు. అడ్మిషన్లు పొందిన అనంతరం ఐదేళ్లలో ఉత్తీర్ణత పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు..

నియత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్నవారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పది, ఇంటర్ పాస్ అయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయినప్పటి నుంచి ఐదేళ్లలోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్‌గా పాస్ అయిన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్‌లో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదవ తరగతి అయితే రూ.100, ఇంటర్ అయితే రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

కాంట్రాక్ట్ తరగతులు..

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతినెల రెండో శనివారం ఆయా అధ్యాయన కేంద్రాల్లో 30 కాంట్రాక్ట్ తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంట్రాక్ట్ తరగతులు హాజరైన వారిని మాత్రమే మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతి ఇస్తారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో నిర్వహించే ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నంద్యాల జిల్లాలో 60 అక్రిడిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్‌లు ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యాయన కేంద్రాల్లో ఏఐ కో ఆర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 27 నుంచి ఆగస్టు 31వ తేదీలోగా అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు. పదవ తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550 అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్ అడ్మిషన్ కలిపి రూ.1,150 చెల్లించాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,800 అన్ని వర్గాల మహిళలు బీసీ, ఎస్సీ,ఎస్టీ, పీహెచ్‌సీ మైనార్టీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాలి. ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది.

అడ్మిషన్లు ప్రారంభం



ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈరోజు నుంచి అడ్మిషన్లు మొదలయ్యాయి. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. గత కొన్నేళ్ల నుంచి పదవ తరగతి, ఇంటర్ ప్రవేశాల సంఖ్య ఏటా పెరుగుతుంది. అడ్మిషన్లు తీసుకున్న వారు ప్రతి ఆదివారం నిర్వహించే కాంట్రాక్ట్ క్లాసులకు హాజరు కావాలి. –సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సార్వత్రిక విద్య వరంలాంటిది



ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ఓపెన్‌స్కూల్ విద్య మంచి అవకాశం. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ ఉపాధి అవకాశాలకు గుర్తింపు ఉంటుంది. చిరుద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి సార్వత్రిక విద్య వరంలాంటిది.

–లక్ష్మీనారాయణ, ఓపెన్ స్కూల్ పర్యవేక్షకులు, నంద్యాల

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- విద్యుత్ సంస్థ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి డయల్ యవర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఫోన్ ద్వారా వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు వీటిని పరిష్కరించాలని కింది స్థాయి అధికారుల ఆదేశించారు. జూనియర్ లైన్‌మెన్ మొదలుకొని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వరకు ప్రతి ఉద్యోగి పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలన్నారు.

పాఠశాలల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వానలు పడుతుండటంతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదన్నారు. అలాగే నూతన గదుల నిర్మాణం కోసం తీసిన గుంతల వైపు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రహరీగోడల దగ్గర సైకిళ్లు ఉంచడం, విద్యార్థులు నిలవడం వంటివి చేయరాదన్నారు. అలాగే వాగులు, వంకలు దాటి పాఠశాలకు రావాల్సి వస్తే పిల్లలు తల్లిదండ్రుల తోడు తీసుకోవాలన్నారు.

తాటివనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): తాటివనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా సిబ్బందికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో వెల్దుర్తి, కృష్ణగిరి, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ, హాలహర్వి, పెద్దకడబూరు మండలాల్లో తాటివనాలు అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. రోడ్ల వెంట, అమృత్‌సరోవర్ చెరువుల గట్లపై, కెనాల్స్ వెంట, చేల గట్లపై తాటి విత్తనాలు నాటించాలన్నారు. కనీసం 2 లక్షల తాటి విత్తనాలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లాక్, అవెన్యూ, ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్‌పై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు. వర్షాలు పడుతున్నందున మొక్కలు నాటితే బతుకుతాయన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో వెల్దుర్తి ఏపీవో అందుబాటులోకి రాకపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వామా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్లెట్లలో పురుగులు


ట్యాబ్లెట్‌కు రంధ్రాలు పడి పొడి రాలిన దృశ్యం

పాములపాడు: రోగాలను నయం చేసే మందుల్లో పురుగులు పడిన ఘటన ఆత్మకూరు పట్టణంలో వెలుగుచూసింది. మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన భాస్కర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 22న భార్య విజయలక్ష్మికి అనారోగ్యంగా ఉండటంతో ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి నాలుగు రకాల మందులు రాసిచ్చారు. అక్కడే ఉన్న తరుణ్ తేజ్ మందుల దుకాణంలో వీటిని కొనుగోలు చేశారు. అయితే బుధవారం ఉదయం ట్యాబ్లెట్ వేసుకునేందుకు షీట్ ఓపెన్ చేయగా Axedura-cv500 ట్యాబ్లెట్‌కు రంధ్రాలు పడి పురుగులు బయటకు రావడంతో ఆందోళనకు లోనయ్యారు. ట్యాబ్లెట్ల తయారీ తేది ఫిబ్రవరి 2023 కాగా.. ఎక్స్‌పైరీ గడువు జులై 2024 వరకు ఉంది. అయినప్పటికీ ఇలా జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మాయలూరు ఫార్మసిస్టు సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే కారణమన్నారు. ముడి పదార్థం నాసిరకం కావడంతోనే ఇలా జరిగి ఉంటుందన్నారు. ప్యాకింగ్ సరిగా లేకపోయినా పురుగులు అందులో చేరుతాయన్నారు. పురుగులు తప్పనిసరిగా చనిపోవాలని, అలా జరగలేదంటే ట్యాబ్లెట్ నాసిరకం అనే విషయం అర్థమవుతుందన్నారు. ఈ కంపెనీ కూడా చెప్పుకోదగ్గది కాదన్నారు.

ఏపీజీబీ టర్నోవర్ రూ.4,810 కోట్లు

- జిల్లా రీజనల్ మేనేజర్ పి. వెంకటరమణ


మాట్లాడుతున్న జిల్లా రీజనల్ మేనేజర్ వెంకటరమణ

కృష్ణగిరి: జిల్లాలోని 61 ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) బ్రాంచీల పరిధిలో రూ. 4,813 కోట్ల టర్నోవర్ జరుగుతోందని ఏపీజీబీ జిల్లా రీజనల్ మేనేజర్ పి. వెంకటరమణ తెలిపారు. కృష్ణగిరిలోని ఏపీజీబీ బ్రాంచ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యమన్నారు. జిల్లాలోని 61 బ్రాంచీల ద్వారా 2023 మార్చి 31 నాటికి రూ.2347కోట్ల డిపాజిట్లు సేకరించామని, వివిధ రుణాలు కింద రూ. 2,486కోట్లు ఇచ్చామన్నారు. కృష్ణగిరి బ్రాంచి 1984లో ప్రారంభించగా ఇప్పుడు రూ.80కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ షేక్ రజాక్, ఫీల్డ్ ఆఫీసర్ శివప్రసాద్, క్యాషియర్ రాజేష్ పాల్గొన్నారు.

భర్తకు లేఖ రాసి భార్య అదృశ్యం


చల్లా వరలక్ష్మి(ఫైల్)

కర్నూలు: ''నా వల్ల కుటుంబంలో సమస్యలు తలెత్తుతున్నాయి. అప్పులు ఎక్కువగా ఉన్నందున నీవు నా వల్ల ఇబ్బంది పడటం ఇష్టం లేదు.. ప్లీజ్... నా గురించి వెతకొద్దు. నీవు అవమానపడటం ఇష్టం లేదు. అందుకే వెళ్లిపోతున్నా'' అంటూ చల్లా వరలక్ష్మి భర్త చల్లా దస్తగిరిరెడ్డికి ఓ లేఖ రాసి ఇంట్లో ఉంచి ఎవరికీ చెప్పకుండా అదృశ్యమయ్యింది. కడప పట్టణానికి చెందిన వీరు అక్కడ అప్పులు ఎక్కువ కావడంతో నెల రోజుల క్రితం కర్నూలుకు వచ్చి కర్నూలు శివారు ఎఫ్‌సీఐ కాలనీ–2లో ఉన్న స్కందాన్షి ఉన్నతి విల్లాస్ ప్లాట్ నెం.11లో నివాసముంటున్నారు. భర్త ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా భార్య టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం ఒక చీటీ రాసి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆమె కోసం భర్త దస్తగిరిరెడ్డి గాలించి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. సుమారు 31 సంవత్సరాలు వయస్సు, 5.3 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి కొత్తబస్టాండ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా నందికొట్కూరు నుంచి హైదరాబాదుకు వెళ్లే ఆర్టీసీ బస్సులో ఎక్కినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు వెళ్లి ఉండవచ్చునన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 91211 01061 లేదా 08518–277187 లేదా 9398664103 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని సీఐ మురళీధర్‌రెడ్డి కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

- డీఈఓ రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

సి.బెళగల్: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు డీఈఓ రంగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన జరగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్టీ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) వినియోగం వంద శాతం ఉండేలా చూడాలని ఎంఈఓలను ఆయన ఆదేశించారు.

సర్వే వంద శాతం చేపట్టాలి

సిస్టమ్ డ్రాపౌట్, స్కూల్ డ్రాపౌట్స్‌పై చేపట్టిన సర్వేను వంద శాతం పూర్తయ్యేలా చూడాలని మండల అధికారులను డీఈఓ రంగారెడ్డి ఆదేశించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అనంతరం పాఠశాలలో మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల, ఎంపీడీఓ రాముడు, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా.. తదితర అధికారులతో డీఈఓ సమావేశమయ్యారు. డ్రాపౌట్ విద్యార్థుల సర్వేపై చర్చించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామాలలో జీఈఆర్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఈఓ సూచించారు. మండలంలో 63 మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా ఉన్నారని, అందరినీ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆయుర్వేదానికి నకిలీ చేటు!

- నకిలీ ఆయుర్వేద మందులతో వైద్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అనుమతి లేకుండా వ్యాపారం
- పట్టించుకునే అధికారులు కరువు

➡ మోకాళ్లనొప్పులు తగ్గేందుకు కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన శివకుమార్ పాతబస్తీలోని ఓ ఆయుర్వేద మందుల దుకాణానికి వెళ్లి మందులు కొన్నాడు. ఆ మందులు వాడిన కొద్దిసేపటికే కడుపులో తీవ్రమైన మంట, విపరీతమైన ఆకలి వేసింది. ఆ కొద్దిసేపటికే ఒళ్లంతా చెమటలు పట్టసాగాయి. దీంతో అయన ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విషయం తెలపగా అవి నకిలీ మందులని, వాటిని వాడటం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్యులు తెలిపారు.

➡ పెద్దకడుబూరుకు చెందిన లక్ష్మిదేవి పక్షవాతం వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లకుండా తెలిసిన వారు చెప్పారని సమీపంలోని గ్రామానికి వెళ్లి వాతలు పెట్టించుకుంది. చేతిపైన వాతలు పెరుగుతున్నాయే గానీ జబ్బు మాత్రం తగ్గలేదు. దీంతో ఆమె కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చి న్యూరాలజీ విభాగంలో చికిత్స పొందారు.

..వీరే కాదు ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా మంది నకిలీ ఆయుర్వేద మందులను వాడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

కర్నూలు(హాస్పిటల్): అల్లోపతి కంటే ఎన్నో వేల సంవత్సరాల ముందుగా ఆయుర్వేద వైద్యం పుట్టింది. దీని ద్వారానే అనేక వైద్యవిధినాలు పుట్టుకొచ్చాయి. ఇలాంటి వైద్య విధానం నకిలీల బారిన పడింది. త్వరగా తగ్గాలనే రోగుల ఆదుర్దాను ఆసరాగా చేసుకుని నకిలీ మందులు తయారు చేస్తున్నారు. వాటిని యథాతథంగా రోగులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని కొనుగోలు చేసి వాడిన రోగులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు ప్రాంతాలు, చుట్టుపక్కల గ్రామాల్లో నాటు వైద్యులు అధికమయ్యారు. వారు చేసేది నకిలీ వైద్యం. కానీ ప్రసార, సామాజిక మాధ్యమాల్లో నమ్మకమైన, మెరుగైన వైద్యం అందిస్తామని, అల్లోపతిలో తగ్గని వ్యాధులు తగ్గిస్తామని, దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయం చేస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ మేరకు కొందరు పట్టణాల్లోని లాడ్జిల్లో, మరికొందరు అపార్ట్‌మెంట్‌లు, అద్దె ఇళ్లల్లో, ఇంకొందరు నడిరోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారు. ప్రధానంగా సంతలు, మార్కెట్‌ల వద్ద ఇలాంటి వారిదే హడావుడి అధికంగా ఉంటుంది. కర్నూలు వంటి నగరాల్లో అయితే నడిరోడ్డుపైనే వందలాది రకాల మందులను రోడ్డుపై పోసి మొండి వ్యాధులను సైతం తగ్గిస్తామని ప్రకటనలు చేస్తూ వైద్యం చేస్తున్నారు. ఇలాంటి వారి వద్దకు మొలలు, ఫిస్టులా, ఫిషర్, వరిబీజం, ఎయిడ్స్, కామెర్లు లైంగిక సమస్యలు, పక్షవాతం వంటి వ్యాధులకు గురైన వారు ఆకర్షితులవుతున్నారు. ఇలాంటి వారిని ఏ ఒక్క అధికారీ ప్రశ్నించడం లేదు. దీంతో ప్రతి ఒక్కరూ ప్రజల బలహీనతను ఆసరా చేసుకుని వైద్యం చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు.

ఆయుర్వేదంలో అల్లోపతి మిక్సింగ్

అల్లోపతి మందులు త్వరగా పనిచేస్తాయి. దీంతో అల్లోపతిలో లభించే నొప్పుల మాత్రలు, స్టెరాయిడ్స్ మాత్రలను ఆయుర్వేదం పొడుల్లో కలిపి వాటిలో రంగులు మిక్స్ చేసి గోళీలుగా చుడుతున్నారు. రంగులను బట్టి ఆయా గోళీలు ఫలానా వ్యాధులకు పనిచేస్తాయని చెప్పి రోగులకు అంటగడుతున్నారు. ఇందులో మెడికల్ షాపుల్లో లభించే వయాగ్రా వంటి మాత్రలను సైతం ఆయుర్వేదం పొడుల్లో కలిపి మాత్రలు తయారు చేస్తున్నారు. అధిక డోసుతో ఉన్న ఈ మాత్రలను వాడిన వారు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో కర్నూలులోని వీకర్‌సెక్షన్ కాలనీ, శిల్పాటౌన్‌షిప్ రోడ్డులలో ఇద్దరు వ్యక్తులు నకిలీ ఆయుర్వేద మందులు తయారు చేస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులకు పట్టుపడ్డారు. వీరు తయారు చేసిన మందులను గ్రామాలు, పట్టణాలు తిరిగి అమాయకులైన వారికి అంటగట్టి సొమ్ము సంపాదించారు. ఇలాంటి వారు ఇప్పటికీ సమాజంలో ఇళ్లలో వ్యాపారాలు చేస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. అల్లోపతి వైద్యంలో జిల్లాకు ఇద్దరు డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు. కానీ ఆయుర్వేదానికి రాష్ట్రమంతా కలిపి ఒకే డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉన్నారు. అది కూడా వారికి మందుల దుకాణానికి లైసెన్స్‌లు ఇవ్వడానికి సమయం సరిపోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఆయుర్వేద మందుల రాయుళ్ల ఆటలు చెలరేగుతున్నాయి.

అర్హులైన వారితోనే చికిత్స చేయించుకోవాలి

బ్యాచ్‌లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్(బీఏఎంఎస్) కోర్సు చేసిన నిపుణులైన వైద్యులు మాత్రమే ఆయుర్వేద చికిత్స చేయాలి. అలా గాకుండా ఎవరు పడితే వారు వంశపారం పర్యంగా వచ్చిందని, ఫలానా గురువు వద్ద నేర్చుకున్నామని, మాది గిరిజన ప్రాంతమని చెప్పి వైద్యం చేయడానికి వీలులేదు. ఆయుర్వేద మూలికలను నేరుగా వాడకూడదు. వాటిని నిర్ణీత పద్ధతిలో శుద్ధి చేసి మాత్రమే వాడాలి. శుద్ధి చేయని ఆయుర్వేద మందులు, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ కలిపి తయారు చేసిన మందులు వాడటం వల్ల ఉన్న రోగాలు తగ్గకపోగా కిడ్నీ, జీర్ణకోశవ్యాధులు వస్తున్నాయి. నిపుణులైన వైద్యులు మాత్రమే ఏది నకిలీ, ఏది అసలో గుర్తుపట్టగలరు.

–డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి

నకిలీ మందులతో ప్రాణాపాయం

ఆయుర్వేదానికి విజయవాడలో కమిషనర్ ఆఫీస్, కడపలో ప్రాంతీయ అధికారి కార్యాలయం ఉన్నాయి. విజయవాడలో మాత్రం ఒక డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉంటారు. నకిలీ మందులకు సంబంధించి వారికి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకుంటారు. ప్రజలు సైతం నకిలీ వైద్యులను ఆశ్రయించకుండా నిపుణులైన, ఆయుర్వేద వైద్య డిగ్రీ పొందిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స చేయించుకోవాలి. ఇతరుల వద్ద చికిత్స చేయించుకుంటే వారు ఇచ్చే మందుల వల్ల ప్రయోజనం జరగకపోగా నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైద్యం చేయించుకోవాలి.

–డాక్టర్ టి. చంద్రశేఖర్‌రెడ్డి, ఆయుష్ అధికారి, కర్నూలు